తక్కువ పెట్టుబడి.. అధిక చేపల ఉత్పత్తి..

- కేజ్ కల్చర్‌తో ఇండియన్ పాంపెనో చేపల పెంపకం
- అల్లవరం మండలంలో రెండు యూనిట్ల ఏర్పాటు

అల్లవరం: సముద్ర తీర ప్రాంతాల్లోని ఉప్పు జలాల్లో కేజ్ కల్చర్ ద్వారా ఇండియన్ పాంపెనో చేపలను సాగు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. సెంట్రల్ మెరైన్ ఫిషరీష్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం(సీఎంఎఫ్ఆర్ఐ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) సంయుక్తంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో గోదావరి పరివాహక ప్రాంతాలలో కేజ్ కల్చర్‌ను ప్రయోగాత్మకంగా చేపట్టారు. జిల్లాలోని అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామానికి చెందిన సాపే కృష్ణమూర్తి, సాపే సురేష్‌లకు ఈ పథకం ద్వారా రెండు కేజ్ కల్చర్ యూనిట్లను మంజూరు చేశారు.

ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం

కేజ్ కల్చర్ ఏర్పాటుచేసిన లబ్ధిదారులు తీర ప్రాంతంలోని ఉప్పు జలాల్లో కేజ్ కల్చర్ ద్వారా పాంపెనో రకం చేపలను పెంచవలసి ఉంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గుర్తించిన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం కేజ్‌లు, వలలు, పాంపెనో చేప పిల్లల, యాంకర్, వాటికి కావాల్సిన ఉపకరణాలు, మేత (ఫీడ్) ఉచితంగా అందిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఈ పథకం ద్వారా కేజ్ కల్చర్‌పై సెంట్రల్ మెరైన్ ఫిషరీష్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం(సీఎంఎఫ్ఆర్ఐ) వారు అవగాహన కల్పించి సాగులో మెళకువలు నేర్పిస్తున్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ లబ్ధిదారులు ఆర్థికంగా బలోపేతం కావడానికి చక్కని అవకాశం ఉంటుంది. ఇండియా పాంపెనో చేపలను సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న లబ్ధిదారులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఇండియన్ పాంపెనో చేపలే ఎందుకు?

ఇండియన్ పాంపెనో చేపలకు కేరళ, గోవా రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది, కేజీ రూ.300 నుంచి రూ.400 వరకూ ధర లభిస్తుంది. ఆరు నెలల్లో ఒక్కొక్క చేప 600 నుంచి 800 గ్రాముల వరకూ బరువు వస్తుంది. ఇండియన్ పాంపెనో చేపలను 30 శాతమున్న ఉప్పు జలాల్లో మాత్రమే సాగు చేయడానికి అవకాశం ఉంది. పైగా తక్కువ పెట్టుబడుతో అధిక చేపల ఉత్పత్తిని సాధించేందుకు దోహదపడుతుంది. అందుకే సముద్ర తీరాన్ని ఆనుకుని ఉప్పు జలాల్లో కేజ్ కల్చర్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. మండలంలోని బెండమూర్లంక పంచాయతీ పరిధిలో నదిపరివాహక ప్రాంతంలో సాగు చేస్తున్న ఇండియా పాంపెనో కేజ్ కల్చర్‌ను సెంట్రల్ మెరైన్ ఫిషరీష్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం డాక్టర్ జీకో కిజాకుడన్ బృందం ఇటీవల సందర్శించారు. తీర ప్రాంత జలాల్లో సముద్రపు చేపల కేజ్ కల్చర్ పెంపకం మత్స్య పరిశ్రమకు లబ్ధి చేకూరుస్తుందని ఆయన చెప్పారు. షెడ్యూల్ కులాల సామాజిక ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. కేజ్ కల్చర్ ద్వారా సాగు చేస్తున్న ఇండియా పాంపెనో చేపలను మార్కెట్ చేసే బాధ్యత సీఎంఎఫ్ఆర్ఐ తీసుకుంటుందని ఆయన లబ్ధిదారులకు భరోసా కల్పించారు.



బెండమూర్లంక నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్



ఇండియా పాంపెనో చేపలను హార్వెస్టింగ్ చేస్తున్న మత్స్యకారులు

సౌకర్యాలు కల్పించారు



ఇండియన్ పాంపెనో చేపలను పెంచేందుకు సీఎంఎఫ్ఆర్ఐ వారు ఇద్దరు లబ్ధిదారులను ఎంపిక చేసి కేజ్ కల్చర్‌కు కావల్సిన సౌకర్యాలు కల్పించారు. 30 శాతమున్న ఉప్పు జలాల్లో మూడు నెలల పాటు సాగు చేశాం. నదీ పరివాహకం కావడంతో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ముందుగా చేపలను హార్వెస్టింగ్ చేస్తున్నాం. కేజ్ కల్చర్‌పై పూర్తి అవగాహన పెంచుకుంటే మంచి లాభాలు ఆర్జించడానికి ఆస్కారముంది.

– సాపే కృష్ణమూర్తి, కేజ్ కల్చర్ యూనిట్ లబ్ధిదారుడు, బెండమూర్లంక

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్



మంత్రి సుభాష్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం ఉదయం సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేయించారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధి మామిడిపల్లి రాము తదితరులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు, జంగా అబ్బాయి వెంకన్న, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల ఆర్గనైజేషన్ ప్రతినిధులు మంత్రి సుభాష్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. అమలాపురంలోని మంత్రి నివాసంలో మంత్రి సుభాష్‌ను చేనేత సంఘం నాయకులు కలిసి సత్కరించారు.

20న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

తాళ్లరేవు: కాకినాడ డివిజన్ పరిధిలోని కాకినాడ రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ కార్యదర్శి ఆర్.సురేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు ఆర్.సురేంద్ర కుమార్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



పోలేకుర్రులో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న కార్మిక సంఘం నాయకులు

తాళ్లరేవు: ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు చేసిన 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాలని, అయితే అధికారులు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో వేతనం రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీస్ శ్రీనివాస్, కె.సింహాచలం, డి.అదృష్టదీపుడు, ఎం.తణుకురాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు తాళ్లరేవులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు: ఈ నెల 20వ తేదీ గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్రీమ్ సేవా సంస్థ ప్రతినిధి దొమ్మేటి శామ్యూల్ సాగర్ తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవు హైస్కూల్ పక్కన గల బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వైద్యులచే ఉచిత నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేట నిషేధ పరిహారం మంజూరు చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా మత్స్యకారులందరికీ వేట నిషేధ పరిహారం చెల్లించాలని మంగళవారం ఫిషర్‌మెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నాయకుడు టి.తనికాశలం కోరారు. 2024 సంవత్సరానికి సంబంధించి వేట నిషేధ కాలం పూర్తయిందని, ప్రభుత్వం పరిహారాన్ని తక్షణం చెల్లించాలని కోరారు. పరిహారం ఆలస్యమైతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ధర్మాచార్య సమ్మేళనానికి స్వామీజీలకు ఆహ్వానం

అమలాపురం టౌన్: ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ జరగనున్న ధర్మాచార్య సమ్మేళనానికి కోనసీమలోని పలువురు స్వామిజీలకు వీహెచ్‌పీ, బజరంగదళ్ ప్రతినిధులు మంగళవారం ఆహ్వానం పలికారు. అమలాపురంలోని శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షిని, అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గీతాశ్రమంలోని మాతాజీని, అంతర్వేదిలోని ఉన్న ఇద్దరి స్వామీజీలను వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల్ని పంపండి



భీమనపల్లిలో అంగన్‌వాడీ పిల్లలకు సర్కిల్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఉప్పలగుప్తం: పిల్లలకు కావలసిన అన్ని సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం కల్పిస్తుందని, పిల్లలను కేంద్రాలకు విధిగా పంపాలని సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ప్రోత్సాహకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు సర్కిల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమాదేవి అంగన్‌వాడీ టీచర్లు డి.సుశీల, డి.కుమారి, కె.విజయలక్ష్మి, ఎస్.మీరాబాయి, లక్ష్మీనరసమ్మ, బాలమ్మ, అరుణ, సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా లంక తల్లమ్మ జాతర



లంకతల్లమ్మ అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ముమ్మిడివరం: మండల ప్రజల ఇలవేల్పు ముమ్మిడివరం లంక తల్లమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత 15 రోజులుగా వివిధ వ్యాపార, వర్తక, కార్మిక సంఘాలు వంతుల వారీగా అమ్మవారి సంబరాలు నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వైభవపేతంగా జరిగింది. తీర్థ మహోత్సవాల్లో మండల ప్రజలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ డి.సురేష్‌బాబు, పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

డ్రైనేజీ సమస్యలపై మ్యాపులు తయారు చేయాలి

- అక్రమ కుళాయిలపై చర్యలు తీసుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఆదేశం



వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: పట్టణంలోని డ్రైనేజీ సమస్యలపై వార్డుల వారీగా మ్యాపులు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ సెక్రటరీలు, సెక్షన్ల అధిపతులతో మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మనోహర్ మాట్లాడారు. డ్రైనేజీల్లో పూడికలు తీయాలని, పట్టణంలో దోమల బెడదను అరికట్టేందుకు ఓ సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. పట్టణంలో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తున్న షాపుల యాజమానులను పూర్తి స్థాయిలో గుర్తించాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా, లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోకుండా వ్యాపారం చేసేవారు మున్సిపల్ చట్టం ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. ఈ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని, తీసుకోని వ్యాపారులపై వచ్చే నెల మొదటి వారం నుంచి చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే అలాంటి వ్యాపారులను ప్రాథమికంగా గుర్తించి నోటీసులు కూడా జారీ చేశామన్నారు. అలాగే పట్టణంలో అక్రమ కుళాయిలను కూడా గుర్తించామని స్పష్టం చేశారు. అలాంటి వారు మర్యాదగా అక్రమ కుళాయిని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. లేని పక్షంలో వారి కుళాయిలను కట్ చేస్తామని తెలిపారు. పట్టణంలో రోడ్డు మార్జిన్లు అక్రమించకుండా పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఈ నాగ సతీష్, ఏఈలు, టీపీఎస్‌లు, వార్డు సచివాలయాల కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు సత్కారం



ఎమ్మెల్యే ఆనందరావును సత్కరిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

అమలాపురం రూరల్: స్థానిక యూపీహెచ్‌సీ వైద్యులు, ఉద్యోగులు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైద్యుడు యేసేబు, లాబ్ టెక్నీషియన్ వెలగట్ల గణేష్, ఫార్మసీ అధికారి యాళ్ల నటరాజన్, డీఈవోజీ శ్రీనివాసరావు, ఎల్‌జీఎస్ బీవీ రమణ తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నడవపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్న ఎంఈఓ సుబ్రహ్మణ్యం

కాట్రేనికోన: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న నడవపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు విద్యా సేవా సమితి చారిటబుల్ ట్రస్టు ద్వారా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను ఎంఈఓ కేటీవీవీఎస్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు చేయూత నివ్వడం శుభపరిణామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు సమకూర్చిన దాత కర్రి శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతా రాంబాబు, సీఆర్‌పీటీ ఎం.శ్రీనివాస్, కర్రి శ్రీనివాసరావు, బి.సురేంద్ర, లీలావతి తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం, తాగునీరుపై శ్రద్ధ చూపాలి



తాగునీరు, పారిశుధ్యంపై సమీక్ష చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్, డీఎల్‌పీఓ బొజ్జిరాజు

అల్లవరం: వర్షాకాలం నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రతి గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ బొజ్జిరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ బొజ్జిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా అపరిశుభ్రత తావు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 58 ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, ప్రజలకు పంపిణీ చేసే తాగునీరు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఓహెచ్ఆర్ ట్యాంక్‌లను శుభ్రం చేసే తేదీలను ట్యాంక్‌ల వద్ద నమోదు చేయాలని, క్షేత్ర స్థాయిలో తాగునీటి శుద్ధతను పరీక్షించే కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగేలా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, ఏఓ లక్ష్మణరావు, ఈఓపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 98 మందికి ఉద్యోగాలు



ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న అడబాల ట్రస్ట్ చైర్మన్ సాయి

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లిలోని హెలింగ్ జాబ్ ప్లేస్‌మెంట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 98 మందికి ఉద్యోగాలు సాధించారని అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల సాయి తెలిపారు. జాబ్‌మేళాలో డీసీబీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్ తదితర తొమ్మిది సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మొత్తం 201 మంది అభ్యర్థులు పాల్గొనగా 98 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. పూర్తి ఉచిత సేవతో నిర్వహించే తమ జాబ్ ప్లేస్‌మెంట్ సంస్థను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన 98 మందికి చైర్మన్ సాయి నియామక పత్రాలు అందజేశారు.

వచ్చే నెల 5 నుంచి దివ్య జ్ఞాన మోక్ష హోమం



సన్నాహక సమావేశంలో పాల్గొన్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలోని విద్యుత్ నగర్‌లో ఉన్న ఆది శేష నిలయంలో జులై 5వ తేదీ నుంచి 3,890వ ధర్మ జ్ఞాన మోక్ష హోమం నిర్వహించనున్నట్లు గౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ వెల్లడించారు. స్థానిక ఆదిశేష నిలయంలో హోమ నిర్వహణపై మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. హోమ నిర్వహణకు ఏర్పేడు వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి వస్తున్నారన్నారు. జులై 5వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ స్వామీజీ స్వీయ పర్యవేక్షణలో దివ్య జ్ఞాన మోక్ష హోమం జరుగుతుందని వివరించారు. సమావేశంలో గో సంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, పశు సంవర్ధక శాఖ అమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, అక్షయ పాత్ర ప్రతినిధులు నంబూరి తేజాకుమారి, డాక్టర్ వాసవి, కేవీ మావుళ్లయ్య, చాగంటి ప్రసాద్, తూము దొరబాబు, కవురు అనసూయమ్మ, గొవ్వాల అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించే షాపులను తొలగిస్తాం

యానాం: ప్రజలకు ఇబ్బంది కలిగించే లిక్కర్ షాపులు, రెస్టొబార్‌లు ఎక్కడైనా ఉంటే వాటిని దశలవారీగా తొలగిస్తామని ఇన్‌చార్జి ఎల్లీ రాధాకృష్ణన్ తెలిపారు. మంగళవారం జరిగిన సముద్ర శక్తి సీ అడ్వెంచర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యానికి హాని కలిగించే ఆల్కహాల్ వంటివాటికి అందరూ దూరంగా ఉండాలన్నారు. గంధపు చెక్కల అక్రమ నిల్వ, వాటి నుంచి సుగంధ నూనెలను తీసే ఫ్యాక్టరీ ఘటన గురించి తమిళనాడు పోలీసులకు పుదుచ్చేరి పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. తమిళనాడు కంటే పుదుచ్చేరిలోనే విద్యుత్ చార్జీలు తక్కువగా ఉన్నాయని, అయితే దశలవారీగా చార్జీలను మరింత తగ్గిస్తామన్నారు.

వార్షిక బడ్జెట్ రూ.12,700 కోట్లుగా నిర్ణయం



ప్రణాళికా బోర్డు సమావేశంలో పాల్గొన్న సీఎం రంగసామి, ఎల్లీ రాధాకృష్ణన్ తదితరులు

యానాం: లోక్‌సభ ఎన్నికల ముందు ఫిబ్రవరిలో పుదుచ్చేరి ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలలకు గాను పరిపాలనా ఖర్చులు తీర్చడానికి శాసనసభలో రూ.4,634 కోట్లతో ఓటాన్ ఎకౌంట్‌ను సమర్పించింది. ఈ నేపథ్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.12,700 కోట్ల వార్షిక వ్యయం ముసాయిదాను నిర్ణయించింది. మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అధ్యక్షతన ప్రణాళికా బోర్డు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.12,700 కోట్లుగా కేంద్రానికి సిఫార్సు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక, హోంమంత్రిత్వశాఖకు పంపించి వారు ఆమోదించిన తర్వాత పుదుచ్చేరి అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారని అధికారులు తెలిపారు. ఎల్లీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ పుదుచ్చేరిని ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. సమావేశంలో సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయం, స్పీకర్ ఆర్.సెల్వం, మంత్రులు పాల్గొన్నారు.

వంతెనను ఢీకొన్న గూడ్స్ ఆటో



శానపల్లిలంకలో వంతెన కింద లోడు ఆటో ముందు భాగం ఇరుక్కుపోయి నుజ్జయిన దృశ్యం

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో బొబ్బర్లంక-పల్లంకుర్రు పంటకాలువపై ఏర్పాటు చేసిన వంతెనను మంగళవారం గూడ్స్ ఆటో ఢీకొని ముందు భాగం నుజ్జయింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద బొబ్బర్లంక-పల్లంకుర్రు పంటకాలువపై ఏర్పాటు చేసిన వంతెనను ముక్తేశ్వరం నుంచి ఎస్.మూలపాలెం సిమ్మెంట్ బస్తాలతో వెళ్తున్న లోడు ఆటో ఢీకొంది. ఆటో డ్రైవర్ చిన్నపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఈ వంతెన నుంచి మోటార్ సైకిల్స్, సైకిల్స్, ఓ మోస్తరు వాహనాలు వెళ్లేందుకే సరిపోతుంది. ఈ వంతెన నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్, పంచాయతీ రాజ్ అధికారులకు అవగాహన ఏ మాత్రం లేక పోవడంతో వంతెన కింద నుంచి రహదారి ఏర్పాటు చేయడం, వంతెన నిర్మాణం కూడా ఏ మాత్రం అవగాహన లేకుండా నిర్మించడం వల్ల తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ వంతెన కింద నుంచి దారిని పూర్తిగా మూసి ఆ పక్కనే వంతెన చుట్టూ ఏర్పాటు చేసిన రోడ్డున వెళ్లేలా చర్యలు తీసుకోవాలని లేక వంతెనను పూర్తి కూల్చి వేసి కొత్త వంతెనను నిర్మించాలని కోరుతున్నారు. అప్పుడే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కాపాడవచ్చని చెబుతున్నారు.

దళిత యువతికి న్యాయం చేయండి

కాట్రేనికోన: ప్రేమించి పెళ్లికి నిరాకరించిన ఉప్పూడి గ్రామానికి చెందిన యువకుడు సాపే నాగరాజుపై కేసు నమోదు చేసి దళిత యువతికి న్యాయం చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. కాట్రేనికోన తహసీల్దార్ కార్యాలయం వద్ద గత ఆరు రోజుల నుంచి దీక్ష చేస్తున్న యువతికి దళిత, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకుడు చీకురుమిల్లి రవికుమార్, గెల్లా రాజేంద్ర, వడ్డి శ్యామ్ ప్రసాద్, నందిక శ్రీను, బడుగు శ్రీను, అయితాబత్తుల బాబ్జి, బీర సత్తిబాబు, శెట్టిబత్తుల తులసీరావు, రేవు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో మంగళవారం స్వామి సన్నిధిలో వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ నెల 22వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు పెద్దింటి వేంకట శ్రీనివాస్, ఎస్‌బీఎం రమేష్, జీఎల్ఎన్ రాజేష్‌లు విష్వక్సేన పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, గ్రామోత్సవం వంటి విశేష కార్యక్రమాలు చేశారు. అటుపై వేంకటేశ్వరస్వామివారి కల్యాణం కనుల పండువగా అర్చకులు నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు సత్కారం

రాజోలు: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించిన పోలీస్ అధికారులకు విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం సత్కరించారు. విద్యార్థి సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై పృథ్వీరాజ్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. సామాజిక సేవపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు ఎన్ఎస్ఎస్ ద్వారా ఎన్నికల్లో విద్యార్థులను పోలీస్ వలంటీర్లుగా సేవలు వినియోగించుకుని వారికి ప్రశంసాపత్రాలు అందజేయడం అభినందనీయమన్నారు.